క్లుప్తంగా

ట్యాలీలో ఉచిత శిక్షణ

కర్నూలు సిటీ: నిరుద్యోగ యువతకు కడపలో ట్యాలీ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ హరి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణతో పాటు, ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి పాసై, ఇంటర్మీడియెట్ పాస్/ఫెయిల్, డిప్లమా పాస్/ఫెయిల్, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారు 18 నుంచి 26 ఏళ్ల వయస్సు ఉన్న వారు శిక్షణకు హాజరు కావచ్చన్నారు. 35 రోజుల కోర్సులో ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్, లైఫ్ , ఇంటర్వ్యూ, వర్క్‌ప్లేస్ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశంకల్పిస్తామన్నారు.మరిన్ని వివరాలకు 9000 487423 నంబరును సంప్రదించాలన్నారు.

ఐసీడీఎస్‌కు బడ్జెట్‌ను పెంచాలి



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న గఫూర్

కర్నూలు(సెంట్రల్): ఐసీడీఎస్‌లో అమలవుతున్న వివిధ ప్రాజెక్టుల కోసం బడ్జెట్‌ను పెంచాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ గఫూర్ డిమాండ్ చేశారు. సోమవారం అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన 36 గంటల నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పదవీ విరమణ తరువాత 10 శాతం గ్రాట్యూటీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా కన్వీనర్ పి.నిర్మల, నాయకులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.

నేడు మహాగౌరికి శాకాంబరి పూజలు

కర్నూలు కల్చరల్: కర్నూలు సూర్యనారాయణ స్వామి ఆలయం ఆవరణలోని మహా గౌరి అమ్మవారికి ఆషాడ మాసం మంగళవారాన్ని పురస్కరించుకుని శాకాంబరి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహ శర్మ తెలిపారు.

బాధిత రైతులకు పరిహారం ఇవ్వాలి



ఆర్డీఓ హరిప్రసాదుకు వినతిపత్రం ఇస్తున్న ఏపీ రైతుసంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): సోలార్ పరిశ్రమ ఏర్పాటులో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట బాధిత రైతులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గని–శకునాల గ్రామాల మధ్య ఏర్పాటైన సోలార్ పరిశ్రమకు 2015లో భూములు ఇచ్చిన రైతులకు ఇంతవరకు పరిహారం చెల్లించకపోవడం దారుణమన్నారు. పరిహారం చెల్లించాలని హైకోర్టు ఆదేశించినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు.

డోర్ డెలివరీ పక్కాగా నిర్వహించాలి

కర్నూలు(రాజ్‌విహార్): ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పార్శిల్స్ డోర్ డెలివరీని పక్కాగా నిర్వహించాలని కర్నూలు–2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ సూచించారు. సోమవారం కింది స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గో, కొరియర్, పార్శిల్స్‌ను డోర్ డెలివరీ అందించేందుకు చర్యలు చేపట్టిందని, సంస్థ లక్ష్యాలు చేరేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

పేదలకు టిడ్కో గృహాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న పి.రామచంద్రయ్య

కర్నూలు(సెంట్రల్): దసరాలోపు పేదలకు టిడ్కో గృహాలను ఇవ్వాలని, లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో పేదలకు తామే పంపిణీ చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య అన్నారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట టిడ్కో గృహాల పంపిణీ కోసం పెద్ద ఎత్తున్న ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో కట్టించిన టిడ్కో గృహాలను పేదలకు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం అన్యాయమన్నారు. జగన్నాథగట్టులోని ఇందిరమ్మ గృహాలకు మౌలిక వసతులు కల్పించేందుకు రూ.250 కోట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. టిడ్కో గృహాలను పంపిణీ చేయకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, నాయకులు మునెప్ప, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

● కలెక్టర్ డాక్టర్ జి.సృజన



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్, జేసీ

కర్నూలు(సెంట్రల్): జగనన్నకు చెబుదాం, స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జేసీ నారపురెడ్డి మౌర్య, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక సారి వచ్చిన బాధితుడు మరోసారి రాకుండా ఎప్పటికప్పుడే సమస్యను పరిష్కరించాలన్నారు. జగనన్న సురక్ష సదస్సుల్లో వచ్చే అర్జీలపై ప్రతి బుధవారం క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు సచివాలయ అధికారులతో చర్చించి కు వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నిబంధనల మేరకు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో నాగేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, మల్లికార్జునుడు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, సీపీఓ అప్పలకొండ పాల్గొన్నారు.

స్పందనలో వచ్చిన సమస్యల్లో కొన్ని..

☛ సర్వే నంబర్ 90/1బీలో ఉన్న తన రెండెకరాల పొలంలో ఎకర సమీప రైతులు ఆక్రమించారని, సర్వే చేయించి, తన పొలం తనకు ఇప్పించాలని తుగ్గలి మండలం ఎర్రదొడ్డికి చెందిన కె.రంగస్వామి ఫిర్యాదు చేశాడు.

☛ సర్వే నంబర్ 770లో 3.90 ఎకరాల పొలం ఉందని, ఆన్‌లైన్‌లో కూడా నమోదై ఉందని, అయితే పాసుపుస్తకాలు ఇవ్వడం లేదని దేవనకొండ మండలం బంటుపల్లెకు చెందిన మల్లికార్జున రెవెన్యూ అధికారులపై ఫిర్యాదు చేశాడు.

☛ జే.హోసల్లి పొలిమేరలోని సర్వే నంబర్ 51/బీలో 8.90 ఎకరాల పొలం ఉందని, దానిని కొందరు గ్రామస్తులు ఆక్రమించుకున్నారని, వారి చెర నుంచి కాపాడేందుకు సర్వే చేయించాలని హాలహర్వి మండలం గూళ్యంకు చెందిన ఈరన్న ఫిర్యాదు చేశాడు.

☛ కల్లూరులోని రాధానగరంలో అంతర్గత రోడ్లు నిర్మించాలని కోరుతూ కాలనీ వాసులు జ్యోతి, గోపాల్, దశరథరెడ్డి ఆధ్వర్యంలో 50 మంది వచ్చి స్పందనలో అర్జీ ఇచ్చారు.

హోమ్ నీడ్స్ పేరుతో మోసం

● స్పందనలో ఎస్పీకి బాధితుల ఫిర్యాదు



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: హోమ్ నీడ్స్, కిచెన్, ఎలక్ట్రానిక్ వస్తువులు సరఫరా చేస్తామని చెన్నైకి చెందిన నిప్పి కంపెనీ నిర్వాహకులు మోసం చేశారని కర్నూలుకు చెందిన డిస్ట్రిబ్యూటర్ వెంకటనారాయణ.. ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో సోమవారం ఎస్పీ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్నూలులోని దేవనగర్‌కు చెందిన వెంకటనారాయణ హోమ్ నీడ్స్ డిస్ట్రిబ్యూటర్‌గా కొన్నేళ్లుగా పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్‌లో మొదట రూ.4 లక్షలు డబ్బు కట్టించుకుని హోమ్‌నీడ్స్ సరఫరా చేశారని, నెల రోజుల క్రితం రెండో విడత రూ.8 లక్షలు డబ్బు కట్టించుకుని నిప్పి కంపెనీ నిర్వాహకులు మోసం చేశారని వెంకటనారాయణ మరో నలుగురు ఉద్యోగులతో కలిసి ఎస్పీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ఎస్పీ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులన్నిటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి త్వరగా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వారికి ఎస్పీ హామీ ఇచ్చారు. స్పందనలో డీఎస్పీ యుగంధర్ బాబు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

☛ రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని దీప్తి అనే మహిళ రూ.4 లక్షలు తీసుకుని మోసం చేసిందని పత్తికొండకు చెందిన జాకీర్ హుసేన్ ఫిర్యాదు చేశారు.

☛ కర్నూలు డీఈఓ ఆఫీస్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని నాగరాజు అనే వ్యక్తి రూ.4.89 లక్షలు తీసుకుని మోసం చేశాడని ఎమ్మిగనూరుకు చెందిన ప్రతాప్ రెడ్డి ఫిర్యాదు చేశారు.

☛ తన కుమారునికి డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి తిరుపతికి చెందిన దయాకర్, ఆలూరు ప్రకాష్ డబ్బు తీసుకుని మోసం చేశారని ఆలూరుకు చెందిన నర్సిరెడ్డి ఫిర్యాదు చేశారు.

☛ శ్రీరామ్ ఫైనాన్స్‌లో ఒక వ్యక్తి షూరిటీ ఇప్పించుకుని డబ్బు తీసుకుని కంతులు కట్టకుండా మోసం చేసి ముంబయికి వెళ్లిపోయాడని, ఇప్పుడు ఫైనాన్స్ వారు తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కొతాళానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు భీమన్న ఫిర్యాదు చేశారు.

☛ పెళ్లి కానుకగా మా అన్న ఇచ్చిన పొలాన్ని ఆయన కుమారులు వెనక్కు ఇవ్వాలని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఎమ్మిగనూరు బనవాసి గ్రామానికి చెందిన బజారమ్మ ఫిర్యాదు చేశారు.

☛ బాగోగులు పట్టించుకోకుండా, అన్నం పెట్టకుండా తన కుమారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన లింగమ్మ ఫిర్యాదు చేశారు.

వినతుల స్వీకరణ



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): స్థానిక నగరపాలక కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి కమిషనర్ భార్గవ్ తేజ పలువురి నుంచి వినతులు స్వీకరించారు. వాటిని త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్పందనలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మున్సిపల్ ఎస్‌ఈ వేణుగోపాల్, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

☛ మురుగు నీటి సమస్యతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని పాత కల్లూరుకు చెందిన అలీఖాన్ విన్నవించారు.

☛ తమ వాణిజ్య షాపుల ముందు డ్రైనేజీ కాల్వలను మెరుగు పరచాలని పాతబస్టాండ్‌లోని స్కంద షాపింగ్ మాల్‌కు చెందిన విక్రమ్‌కుమార్ అభ్యర్థించారు.

☛ తమ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఖాళీ ప్లాట్లలోని మురుగు నీరు ఇళ్ల ముందు ప్రవహిస్తోదని మారుతీనగర్‌కు చెందిన ఈరమ్మ ఫిర్యాదు చేశారు.

☛ తమ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని చంద్రశేఖర్ నగర్ మూడో లైన్‌కు చెందిన సుబ్బయ్య కోరారు.

☛ తమ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని జగన్నాథ గట్టు హౌసింగ్ కాలనీకి చెందిన నాగన్న విన్నవించారు.

☛ టిడ్కో ఇంటికి చెల్లించిన రుణాన్ని తిరిగి ఇవ్వాలని విజయనగర్‌కు చెందిన రత్నమ్మ అభ్యర్థించారు.

పెద్ద తప్పు.. చిన్న శిక్ష

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఉన్నతాధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. తమకు కావాల్సిన అధికారులు తప్పు చేసినా వెనుకేసుకొస్తున్నారు. ఎంత పెద్ద తప్పు అయినా చిన్న శిక్షతో సరిపెడుతున్నారు. కర్నూలు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ 2 చైతన్య రాయులు, సీనియర్ అసిస్టెంట్ ఎం.ఇ.గోపాల్ ఓ ఫేక్ చలానాతో రిజిస్ట్రేషన్ చేసి ఖజానాకు నష్టం వాటిల్లేలా చేసినా సస్పెండ్ చేయకుండా డిప్యుటేషన్‌పై మరో ప్రాంతానికి పంపి చేతులు దులిపేసుకున్నారు. – కర్నూలు (సెంట్రల్)

● రిజిస్ట్రేషన్ శాఖలో ఉన్నతాధికారుల ఇష్టానుసారం
● ఫేక్ చలానాతో రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిసినా కఠిన చర్యలకు వెనకడుగు
● డిప్యుటేషన్‌తో సరిపెట్టిన రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2022 సెప్టెంబర్ 23న ఓ ఆస్తికి సంబంధించి రిజిస్ట్రేషన్ జరిగింది. అందుకు సంబంధించి డాక్యుమెంట్ నంబర్ 15058/2022గా నమోదు చేశారు. అయితే ఈ ఆస్తి స్టాంప్ డ్యూటీ కోసం రూ.1,20,850 చెల్లించాల్సి ఉంది. ఇంతవరకు బాగానే ఉన్నా ఈ స్టాంప్ డ్యూటీకి సంబంధించి అప్పటి సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న చైతన్యరాయులు, సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఎం.ఇ.గోపాల్ ఓ ఫేక్ చలానాను అనుమతించారు. దీంతో ఖజానా రూ.1,20,850 నష్టపోవాల్సి వచ్చింది. ఈ వ్యవహారంపై ఆర్‌టీఐ కార్యకర్త అప్పటి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ, జిల్లా రిజిస్ట్రార్‌లకు ఫిర్యాదు చేశాడు. అయితే ఆ ఫిర్యాదుపై విచారణను అధికారులు తొక్కిపెట్టారు. దీంతో ఆర్‌టీఐ కార్యకర్త మరోసారి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ప్రస్తుతం జిల్లా రిజిస్ట్రార్‌గా ఉన్న నాగలింగేశ్వరరావు విచారణ చేపట్టి రిజిస్ట్రేషన్ కోసం సమర్పించిన చలానా నకిలీదిగా గుర్తించారు. అంతేగాక రాష్ట్ర ఖజానాకు రూ.1,20,850 నష్టం వాటిల్లిందని నిర్ధారించారు. ఇందుకు సంబంధించిన అప్పటి సబ్ రిజిస్ట్రార్ చైతన్యరాయులు, సీనియర్ అసిస్టెంట్ ఎం.ఇ.గోపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

డిప్యుటేషన్‌తో సరిపెట్టిన వైనం

ఫేక్ చలానాకు సంబంధించి ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించాలి. అయితే వారిపై ఉన్న ప్రేమ ఏమో కాని డిప్యుటేషన్‌తో సరిపుచ్చారు. చైతన్యరాయులును దువ్వూరుకు, ఎం.ఇ.గోపాల్‌ను పాణ్యం సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు డిప్యుటేషన్‌పై పంపి చేతులు దులుపుకున్నారు. ఫేక్ చలానాతో ఖజానాకు నష్టం వాటిల్లినట్లు విచారణలో నిర్ధారణ అయినా వారిని సస్పెండ్ చేయకుండా డిప్యుటేషన్‌పై పంపడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారులను ఉన్నతాధికారులు వెనుకేసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఇంతటి తీవ్రత ఉన్న కేసు విషయంలో డిప్యుటేషన్‌తో సరిపెట్టడం పద్ధతి కాదని, మరో అధికారి ఇలాంటి తప్పు చేయకుండా ఉండాలంటే వారిని సస్పెండ్ చేసి పూర్తిస్థాయి విచారణ జరపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(రూరల్): నగరంలోని 32, 35 వార్డులలోని కల్లూరు, చింతలముని నగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు సుధాకరప్ప, రామకృష్ణ కోరారు. సోమవారం వారు ఆయా వార్డుల సమస్యలను సచివాలయాల అడ్మిన్ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విన్నవించారు.

☛ కార్మికులుఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు బతుకన్న డిమాండ్ చేశారు. సోమవా రం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు.

టీటీడీ ఆధ్వర్యంలో కథల పోటీలు



మాట్లాడుతున్న సమన్వయ కర్త మల్లు వెంకటరెడ్డి

కర్నూలు కల్చరల్: ఈనెల 23న సీక్యాంప్ టీటీడీ కళ్యాణ మండపంలో, 30న డోన్ పట్టణంలోని శ్రీసుధ విద్యాలయంలో కథల పోటీలు నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా సమన్వయ కర్త డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం సీక్యాంప్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు 'కథ చెబుతారా ఊ కొడతాం' శీర్షికతో పోటీలు నిర్వంచనున్నట్లు తెలిపారు. 10 ఏళ్లలోపు ఒక విభాగం, 10 నుంచి 15 ఏళ్లలోపు ఒక విభాగం చొప్పున పోటీలు నిర్వహిస్తామని, కథా చెప్పడానికి 5 నిమిషాల సమయం ఉంటుందని తెలిపారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.1000, రూ.750, రూ.500 నగదు బహుమతులు అంజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9059802265 నంబర్‌ను సంప్రదించాలన్నారు. సమావేశంలో ధార్మిక సంస్థల ప్రతినిధులు మారం నాగరాజుగుప్త, మేడా సుబ్రహ్మణ్యం స్వామి, ఎద్దుల మహేశ్వరరెడ్డి, పసుపులేటి నీలిమ, సురేష్, రమేష్, మల్లేష్ నాయుడు, కృష్ణ మోహన్, జనార్దన్, వీరేశ్, తదితరులు పాల్గొన్నారు.

కరాటే ఆత్మరక్షణకు దోహదం



విద్యార్థినులతో కళాశాల అధ్యాపకులు

కర్నూలు(రూరల్): మహిళల ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని కేవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి తెలిపారు. సోమవారం కళాశాలలో యూనివర్సల్ కరాటే మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాశాంతి మాట్లాడుతూ ఆటల వల్ల శరీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతామన్నారు. అనంతరం బ్లాక్, ఆరెంజ్, కలర్ బెల్ట్‌లు సాధించిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమానికి అధ్యాపకులు శోభారాణి, ఇమ్మానుయేల్, మణికంఠ, వైస్ ప్రిన్సిపాల్ వీరాచారి, మాస్టర్ టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

‘సురక్ష’తో పేదలందరికీ ప్రభుత్వ ఫలాలు

● కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): ప్రజలందరికీ ప్రభుత్వ ఫలాలు అందాలన్నదే జగనన్న సురక్ష సదస్సుల లక్ష్యమని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం 2, 6, 43, 48 వార్డుల పరిధిలోని 4, 17, 30, 111, 124 సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష సదస్సుల్లో ఎమ్మెల్యే పాల్గొని పలువురికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజల ముంగిటకే పాలన వచ్చిందన్నారు. ఇంకా ప్రభుత్వ ఫలాలు అందని వారు ఎవరైనా ఉంటే జగనన్న సురక్ష సదస్సుల్లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అర్హులుగా చేర్చుతామన్నారు. అలాగే జనన, మరణ, నివాస, ఆదాయ, ఫ్యామిలీ సర్టిఫికెట్లు, ఆరోగ్యశ్రీ కార్డులు కావాల్సిన వారు దరఖాస్తు చేసుకుంటే సదస్సుల్లోనే అందజేస్తామన్నారు. నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందించాలన్న ఉద్దేశంతో జగనన్న సురక్ష సదస్సులు చేపడుతున్నట్లు తెలిపారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సదస్సులను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. సదస్సుల్లో ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, రెవెన్యూ అధికారి జునీద్, కార్పొరేటర్లు షేక్ నీలోఫర్, విజయలక్ష్మి, సయ్యద్ మల్లికాబేగం, నాయకులు ఆదిమోహన్ రెడ్డి, సీహెచ్ మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న క్రీడాకారుడు గౌతంరాజు

కర్నూలు(రాజ్‌విహార్): వేరే దేశంలో జరుగుతున్న క్రీడల్లో పాల్గొనేందుకు ప్రభుత్వంతో ఆర్థిక సాయం చేయించిన ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌కు క్రీడాకారుడు కృతజ్ఞతలు తెలిపారు. గత నెలలో జపాన్‌లో జరిగిన మెన్స్ సాఫ్ట్ బాల్ ఏషియన్ కప్ ఛాంపిచన్ షిప్ పోటీల్లో కర్నూలు 1వ వార్డు చిదంబరవీధికి చెందిన పి.గౌతంరాజు పాల్గొన్నాడు. అక్కడికి వెళ్లేందుకు ఆర్థిక స్తోమత లేని విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. శాప్ ఉన్నతాధికారులతో మాట్లాడి రూ.1.20 లక్షలు మంజూరు చేయించి చెక్‌ను అందించడంతో క్రీడాకారుడు గౌతంరాజు, తండ్రి పి.కన్నా దేశాయ్ సోమవారం ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సద్వినియోగం చేసుకుని, ఉన్నత శిఖరాలు చేరాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పి.షాషావలి, ఆర్షియా ఫర్హీన్, నీలోఫర్, పాల్గొన్నారు.

నేడు సబ్సిడీపై టమాటా పంపిణీ

కర్నూలు (అగ్రికల్చర్): నగరంలోని రైతుబజార్లలో మంగళవారం సబ్సిడీ టమాట పంపిణీ చేయనున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి సోమవారం తెలిపారు. మదనపల్లిలో కొనుగోలు చేసి, కర్నూలుకు తీసుకువచ్చేందుకు కిలో టమాటాకు రూ.113.09 అయ్యిందని, వినియోగదారుల సౌకర్యార్థం రూ.50 విక్రయిస్తామని చెప్పారు. మిగతా రూ.63.09 ప్రభుత్వం భరిస్తుందన్నారు. సి.క్యాంప్, అమీన్ అబ్బాస్ నగర్, కొత్తపేట రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లలో ఆధార్/రేషన్ కార్డు జిరాక్స్ కాపీ ఇచ్చి టమాట కొనుగోలు చేయాలని ఆయన సూచించారు.

సబ్‌స్టేషన్ నిర్మాణంలో నాణ్యత తప్పనిసరి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎస్‌ఈ ఉమాపతి

కర్నూలు(రాజ్‌విహార్): మెరుగైన వైద్యం అందించేందుకు చేపడుతున్న సబ్‌స్టేషన్ల నిర్మాణంలో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని ఏపీఎస్పీడీసీఎల్ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి ఆదేశించారు. జగన్నాథగట్టుపై నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ పనులను సోమవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట కన్‌స్ట్రక్షన్ ఈఈ రాజేష్, డీఈఈలు సుబ్బన్న, రంగస్వామి ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

కర్నూలు(రూరల్): విద్యార్థులు తమకిష్టమైన క్రీడల్లో రాణించాలని ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ సమీవుద్దీన్ ముజ్జమ్మిల్ అన్నారు. ఈనెల 8న బి.క్యాంప్‌లో జరిగిన డిగ్రీ కళాశాలల రగ్బీ పోటీల్లో ఉస్మానియా కళాశాల జట్టు రన్నర్స్‌గా నిలిచింది. సోమవారం కళాశాలలో క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రఫిక్ అహ్మద్, పట్టాభి పాల్గొన్నారు.

సమష్టిగా పోరాడితే టీబీ ఓడిపోతుంది



హ్యాండ్ బుక్‌లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య, పంచాయతీ అధికారి నాగరాజునాయుడు తదితరులు

కర్నూలు(హాస్పిటల్): ప్రజలందరూ సమష్టిగా పోరాడితే టీబీ ఓడిపోతుంది...దేశం గెలుస్తుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. టీబీ ముక్త పంచాయత్ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామపంచాయతీల్లో జరిగే వీహెచ్‌ఎన్‌సీ, జేఏఎస్ మీటింగ్‌లలో టీబీ ఆవశ్యకత, అవగాహన కల్పించి ప్రజలను చైతన్యపరచాలని ఆయన సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టీబీ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు సమన్వయంతో జిల్లా స్థాయి టీబీ ముక్త పంచాయత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ అధికారులకు హ్యాండ్ బుక్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వ్యాధిలక్షణాలున్న వారందరికీ టీబీ పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, లెప్రసి, టీబీ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, మలేరియా అధికారి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

యునాని వైద్యుని ఇంట్లో చోరీ



సీసీ ఫుటేజీలో నమోదైన నిందితుని చిత్రం

కర్నూలు: యునాని వైద్యుడు ఎం.అబ్దుల్ ఖాదర్ ఇంట్లో చోరీ జరిగన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. అబ్దుల్ ఖాదర్ నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని హెచ్‌హెచ్ ప్లాజా ఫ్లాట్ నం.301లో నివాసముంటున్నారు. ఈయన డీఎంహెచ్‌ఓ ఆఫీస్‌లో పనిచేసేవారు. ఈనెల 6న ఇల్లు ఖాళీ చేసి హైదరాబాదుకు మకాం మార్చారు. సామానులు సర్దుకునే సమయంలో బంగారు, వెండి వస్తువులు ఉన్న బ్యాగును ఇంట్లోనే మర్చిపోయి వెళ్లారు. సోమవారం హైదరాబాదు నుంచి కర్నూలుకు వచ్చి చూడగా బంగారు, వెండి వస్తువులున్న బ్యాగు కనిపించకపోవడంతో మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 15 తులాల బంగారు, 300 గ్రాముల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అపార్ట్‌మెంట్‌కు ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించగా ఇద్దరు యువకులు ఇంట్లోకి ప్రవేశించినట్లు గుర్తించి, పాతబస్తీలోని చిత్తారి వీధికి చెందిన వెంకటేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు సమాచారం. మరో నిందితుడు మోహన్‌తో కలిసి చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. పరారీలో ఉన్న మోహన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిందితులు భవన నిర్మాణాల వద్ద విద్యుత్ మోటార్లు, ఇనుప కడ్డీలు చోరీ చేసి గుజిరీ దుకాణాల్లో విక్రయించి సొమ్ము చేసుకుని జల్సా చేస్తున్నట్లు తెలిసింది.

పెయింటర్ ఆత్మహత్య

కర్నూలు: స్థానిక బి.క్యాంప్‌లోని అరోరా నగర్ చిన్న జమ్మిచెట్టు సమీపంలో నివాసముంటున్న భాస్కర్ (35) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన పెయింటర్ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈయనకు ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు కూతురు సంతానం. ఆమెను వదిలేసి ప్రస్తుతం రెండో భార్య జయశ్రీతో కలిసి ఉంటున్నాడు. కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం సాయంత్రం మద్యం తాగి గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వెనుక కాచిగూడ నుంచి గుంటూరు వెళ్లే ప్యాసింజర్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో రైల్వే పీఎస్ ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి మృతుని కుటుంబానికి సమాచారమిచ్చారు. ఇతను గతంలో కూడా రెండుసార్లు రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించగా కుటుంబ సభ్యులు కాపాడారు.